# ఆలయం

ఆలయ ప్రాంగణం అంతా జనసందోహం, త్రొక్కిసలాట, అరుపులు, అభ్యర్థనలు, పసిపిల్లల ఏడ్పులు, పెద్దల ఓదార్పులు.

హారతికర్పూరం వెలుగులు, కొబ్బరికాయల మోతలు, అగరు వత్తుల పొగలు, అర్చనలు, అభిషేకాలు, మంత్రాలు, నివేదనలు, గణగణ గంటల మోతలు, లోపలికి వచ్చేవారు, బయటికి వెళ్ళేవారు రుద్రాక్షమాలలు, కుంకుమ బొట్లు, గంధపు పూతలు, హరికథలు, పురాణ ప్రవచనాలు, ఒకపక్క సినిమా పాటల హోరుతో చిత్ర పటాల అమ్మకం, భక్తిగీతాలు, స్తోత్రమాలల పుస్తకాల విక్రయం మరో ప్రక్క

అన్నింటినీ, అందర్నీ తిలకిస్తూ మౌనంగా, భావగర్భితంగా గర్భగుడిలో భగవానుడు.

ఆలయ ముఖద్వారం దగ్గరే దర్శనమిచ్చిన ప్రకటన.

ఆకుపూజ .... రూపాయి

అష్టోత్తరం .... రెండ్రూపాయలు

సహస్రనామార్చన .... నాలుగు రూపాయలు

కొబ్బరికాయ కొట్టినందుకు .... పావలా

హారతి వెలిగించేందుకు .... పది పైసలు

ప్రత్యేకదర్శనం .... పది రూపాయలు

ప్రసాదం ... ఆర్డినరీ .... అరవై పైసలు

ప్రసాదం ... స్పెషల్ .... రూపాయి

కథా నిలయం
3762
శ్రీకాకుళం

ఇట్లు

దేవస్థానం కమిటీ

అంతే. అడుగు ముందుకి పడలేదు. గడప దాటనేలేదు. మౌనంగా వెనుతిరిగేడు.

★ ★ ★

ఆటోలు, రిక్షాలు, స్కూటర్లు, కార్లు వగైరా వగైరా వాహనాలన్నీ అస్తవ్యస్తంగా నిలిచి ఉన్నాయి. ఆడ, మగ, చిన్న పెద్ద హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

మాటలు కూడా సరిగ్గా రాని పసిపిల్లలు నిస్సహాయంగా తల్లిదండ్రులతో పేచీపడుతూ, లాలూచీ పడుతూ ఉన్నారు.

అడ్మిషన్ ఫీజు .... ఆరువందలు
టరమ్ ఫీజు .... అరవై రూపాయలు
ట్యూషన్ ఫీజు .... రెండువందలు
స్పెషల్ ఫీజు .... యాభై
బిల్డింగ్ ఫండ్ .... వెయ్యి

పిల్లవాణ్ణి బడిలో చేర్చాక రిక్షాచార్జీలు, యూనిఫాం, బూట్లు, సాక్సు, బెల్టు వగైరాల్తో వెరసి మూడు వేలు. మూడు సంవత్సరాలు కూడా నిండని పసివాడి చదువుకు మూడువేలు.

ప్రిన్సిపాల్ గారితో ఇంటర్వ్యూ ఒకవైపు, ఫీజులు కట్టేందుగ్గాను మరోక్యూ, రికమెండేషన్లు, ఉత్తరాలు, ఫోన్లు.

గందరగోళం, గజిబిజి.

★ ★ ★

"మీ సైకిళ్ళు పోయినచో మా బాధ్యత లేదు" అట్టమీద వ్రాసి స్తంభానికి వ్రేలాడగట్టారు.

మరింకా టోకెనెందుకు తీసుకోవాలో అర్థంకాలేదు. అర్థ రూపాయి ముడుపెందుకు చెల్లించాలో అంతుపట్టలేదు. నలుగురితో పాటు నారాయణ.

అదో ప్రభుత్వ కార్యాలయం.

ఉద్యోగస్థులంతా ఒక్కొక్కరే వచ్చి వారి వారి సీట్లలో కూర్చుంటున్నారు.

గుడ్‌మార్నింగ్‌లు, హలోల్తో అరగంటపైనే గడిచిపోయింది.

అభ్యర్థనలు, ఆర్డర్లు, తిరస్కారాలు, తీర్పులు, గుసగుసలు, నిట్టూర్పులు, పెదవి విరుపులు, తలవిసుర్లు.

ఊగిపోయే బెంచీలు, కాళ్ళులేని కుర్చీలు, దుమ్ము పేరుకు పోయిన ఫైళ్ళు.

ఫైలు తీస్తే లంచం.

ఫైలు చూస్తే లంచం.

లంచం తీసుకునే మనిషిని చూపినందుకు లంచం. లంచం తీసుకున్నందుకు దండం. బల్లమీద ఫైళ్ళు. ఫైళ్ళ మధ్య చేతుల మధ్య నోట్లు.

వాయిదాలు, వర్జాలు, కరచాలనాలు, చిరునవ్వులు, విదిలింపులు, ఈసడింపులు, వ్యంగ్యం, వ్యాఖ్యానం.

అతని పని వాయిదా పడింది.

వెనుతిరిగాడు, నిస్సహాయంగా, నిస్పృత్తువగా నిర్లిప్తంగా.

★ ★ ★

సచివాలయం.

బోర్డు చూడగానే ప్రజల కొరకు, ప్రజలయొక్క, ప్రజలచేత

ఎప్పుడో చదువుకున్న పాఠం గుర్తు వచ్చింది. విరక్తితో కూడుకున్న నవ్వు పెదిమల పైన మెరిసింది.

అధికార పక్షం. అధికారులు, హోదాలు,

రాజీలు .... రాజీనామాలు.

హర్షధ్వానాలు ఎత్తిపొడుపులు.

నమస్కారాలు, నక్క వినయాలు.

ఎత్తులు, జిత్తులు.

కీచులాటలు, కుమ్ములాటలు.

ఆరోపణలు, నివేదికలు, తీర్మానాలు.

పదవులు పదిలపరుచుకునే ప్రయత్నాలు, అధికార పీఠాన్ని సుస్థిరం చేసుకునే ప్రణాళికలు, సభలు, సమావేశాలు, సంతాపాలు.

ప్రజాబలం కావాలి. ప్రజాశ్రేయస్సుతో పనిలేదు.

ఆస్తులు పెంచుకోవడం ఎట్లా ?

అధికారం నిలుపుకునే దెట్లా ?

వివాదాలు నినాదాలు.

జిందాబాద్‌లు... డౌన్ డౌన్లు.

ప్రజా రక్షకులు కాదు - ప్రజా భక్షకులు !

నాయకులు కాదు - వినాయకులు !

డబ్బు, లారీలు, లూటీలు, లాకప్‌లు, మానభంగాలు....ఏవి ఎన్ని జరుగుతున్నా పదవి .... పదవి .... పదవి !

★ ★ ★

అందమైన భవనం. పోర్టికోలో మిలమిల మెరిసిపోతూ కారు. అందంగా కత్తిరించివున్న క్రోటన్స్. డాక్టరుగారి పేరు, డిగ్రీలు రాసిఉన్న బోర్డు లైటు కాంతిలో మరింత స్పష్టంగా కనిపిస్తూంది.

ట్రేలు పట్టుకుని హడావిడిగా తిరుగుతున్న నర్సులు, నంబరు కార్డులు పంచి యిస్తున్న కాంపౌండర్లు, నేల తుడుస్తున్న ఆయాలు.

మందుల వాసన ఫినాయిల్ కంపు .. పసిపిల్లల ఏడుపులు.

పలకరింపులు, పరామర్శలు, మందు చీటీల రెప రెపలు, రూపాయి నోట్ల పెళ పెళలు.

డాక్టరుగారి రూం ముందు రోగులబారులు, కన్సల్టేషన్ ఫీజు నూరు.

సింగిల్ రూము ఇరవై అయిదు రూపాయలు.

డబుల్ రూము నలభై రూపాయలు.

మందులు మాత్రం హాస్పిటల్ ఆవరణలో వున్న మందుల షాపులోనే దొరుకుతాయి. అక్కడ కొనక తప్పదు.

నీళ్ళ మందులు, కల్తీ మందులు, మాయ మందులు, కుతకుత మరుగుతున్న నీళ్ళు, నీళ్ళలో నిస్తేజంగా సిరంజీలు.

అవసరంలేని ఆపరేషన్లు.

అక్కరకురాని ప్రిస్క్రిప్షన్లు.

డాక్టరుకు ధనభీతి. రోగికి ప్రాణ భీతి.

డబ్బు ఒక చేతిలో, ప్రాణం ఒక చేతిలో పెట్టమని రెండు చేతులూ జోడిస్తూ మరో బ్రాంచికి వెళ్ళే తొందర్లో బరబరా కోసేసి చరచరా వెళ్ళిపోయే డాక్టర్లు. కాసుల్లేకపోతే కాటికి పోవడమే తప్ప ఆ కాంపౌండ్‌లో కాలుపెట్టే స్తోమత లేదు. అందుకే ఆ ప్రయత్నం చేయలేదు.

★ ★ ★

గ్రంథాలయం.

బోర్డు చూడగానే ఒళ్ళుపులకరించింది. మనసుపరవశించింది.

అందులోకి ఎవరైనా వెళ్ళవచ్చు. అందుబాటులో వున్నంత వున్న కోరిన పుస్తకం తీసుకొని చదువుకోవచ్చు. తెలియని విషయాలెన్నో తెలుసుకోవచ్చు. సాహిత్యలోకంలో సంచరించవచ్చు. విజ్ఞానాన్ని సంస్కారాన్ని సంపాదించుకోవచ్చు.

అంతా నిశ్శబ్దం. ప్రశాంతత.

ఏ ఆలయానికి వెళ్ళినా దొరకని తృప్తి, ఆనందం అక్కడ దొరికిందతనికి. అందుకే సంతోషంగా అందులోకి కాలు పెట్టే డతగాడు.

అతను చదువుకున్నవాడు కాబట్టి ఆ సంతోషం మిగిలింది. మరి చదువురాని నేను ?

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 30-3-88)